# శాపం

మిట్టమధ్యాహ్నం ఎండ మండిపోతోంది. మాగన్ను నిద్రలోకి జారిపోయిన పద్మ చేతిలోంచి పుస్తకం టప్‌మని కిందపడటంతో వులిక్కిపడి కళ్ళు తెరిచింది. గదిలో ఫ్యాను చప్పుడు మినహాయిస్తే నిశ్శబ్దంగా వుంది. చుట్టూ కలియ చూసింది. సుమ కనిపించలేదు, పద్మ మంచంమీంచి లేచి ఆతృతగా చూసింది. ఎక్కడా వున్న జాడలేదు. మంచం కింద నిద్రపోయిందేమోనని చూసింది. లేదు, వంటింట్లోకి వెళ్ళి చూసింది. అక్కడా లేదు. తలుపు దగ్గరగా వేసివుంది. దొడ్లో కెళ్ళి నీళ్ళగదిలో చూసింది. అంతా కలియ చూసింది ఎక్కడాలేదు. వీధిలో గేటుదగ్గర కొచ్చింది. వీధంతా నిర్మానుష్యంగా వుంది. పాదరసం కరిగి ప్రవహిస్తున్నట్లు ఎండ కళ్ళలోకి కొడుతోంది.

పద్మ గుండెల్లో భయంగా అనిపించింది, సుమ ఎక్కడికెళ్ళింది చెప్మా? అని ఆలోచనలో పడింది. స్వంతంగా ఎక్కడికీ వెళ్ళే వయసుకూడా లేదు. నాలుగు రోజులక్రితం మూడో ఏడు నిండి నాలుగు వచ్చింది. నోరులేని పసిపిల్ల.

పక్కింట్లో వుండేమో చూద్దామని అటువైపు రెండు అడుగులు వేసింది పద్మ, ఇంట్లోంచి శబ్దం లేదు, అంతా నిద్ర పోతున్నారేమోనని తటపటాయిస్తూ నిలబడింది. పిలిస్తే ఏమనుకుంటారోనని మొహమాటంగా వుంది. కాని మనసు నిలవడంలేదు. కాళ్ళు వొణుకుతున్నాయి. గుండెల్లో గుబులు మరీ ఎక్కువైంది. చేసేదిలేక కిటికీలోంచి "మా సుమ వుందాండీ" అంది. అప్పటికే ఆమె గొంతులో దుఃఖం చోటు చేసుకుంది.

"రాలేదమ్మా" అన్న జవాబు వినగానే కళ్ళల్లో నీటి పొర కమ్మేసింది. భయంకరమైన వూహాలు క్షణంలో మనసును కమ్మేశాయి. ఒకే పరుగులో దొడ్లోకి పరుగెట్టి నూతిలోకి తొంగిచూసింది. నీళ్ళు నిశ్చలంగా వున్నాయి. స్పష్టంగా కనిపించే తన ప్రతిబింబం చూసి, ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. మళ్ళీ వీధిలోకి వచ్చి గేటుదగ్గర నిలబడి అటూ యిటూ చూసింది. ఎదురింటి డాబా మీంచి, సన్నగా ముద్దుగా పాట వినిపించింది. అవును ! అది సుమ గొంతుకే అనుకుని చక చకా నడిచింది. ఎలా వెళ్ళిందక్కడికి ? ఎందుకు వెళ్ళింది ? అక్కడెవరూ తెలిసినవాళ్ళు కూడా లేరే! అనుకుంటూ పద్మ చకచకా మెట్లు ఎక్కింది. ఎదురుగా ఒకే గది వున్న వాటా - చాపమీద కూర్చుని ఆమె వొళ్ళో సుమని కూర్చోబెట్టుకుని బుగ్గలు నిమురుతూ పాట వింటోంది.

"చిన్ని రోజా పువ్వు"

ఎండలో కూచుని వెక్కి వెక్కి ఎందుకు ఏడుస్తుంటివి– అంటూ ఉషారుగా పాడేస్తోంది సుమ. పద్మకి చర్రున కోపం వచ్చింది. అంతవరకు సుమకోసం తలడిల్లిపోయిన ఆ తల్లి హృదయం అసహనంతో కుతకుతలాడిపోయింది.

"సుమా" అంటూ అరిచింది.

సుమ భయంగా లేచింది. ఆమె చటుక్కున లేచి "రండి" అంటూ ఆహ్వానించింది. ఎందుకో పద్మకు ఆమెని చూస్తే చిరాకుగా కోపంగా అనిపించింది.

"మీ పాప గుమ్మంలో వుంటే నేనే పిలిచా" అంది.

"నేనంతా వెతుక్కుని హడలి చచ్చాను" అంటూ సుమని చేతుల్లోకి తీసుకుంది. ఆమె పెదవులు అప్రయత్నంగా సుమ బుగ్గలను స్పృశించాయి.

"అరే ! మీరు చూశారనుకున్నాను. కూర్చోండి" అందామె.

పద్మ మరీ బాగుండదని కూర్చుంది.

"మీ పేరు"

"సుశీల, మేం వచ్చి మూడు రోజులైంది" ఆమె తెల్లటి విశాలమైన కళ్ళల్లో నీలి నీడలు పద్మ కనిపెట్టింది. కానీ పట్టించుకోలేదు.

"అందుకే నాకు తెలీలేదు వస్తానండి. తలుపులన్నీ తీసి వచ్చాను" అంటూ లేచి చకచకా అడుగులు వేసింది పద్మ.

ఇంట్లో అడుగు పెడుతూనే సుమని వాళ్ళంతా ముద్దులతో ముంచేసి -

"ఏమే భడవా ! నువ్వు కనిపించక కంగారు పడి పోయాను. చెప్పకుండా వెళ్ళొచ్చా ?" అంది కోపం నటిస్తూ.

"అమ్మా, ఆ అత్త బలే మంచిది నాకు బిస్కట్లు పెట్టింది" అంది.

o o o

"ఇంకెప్పుడూ చెప్పకుండా వెళ్ళకు" అంది పద్మ.

అతను చిన్న ట్రంకు పెట్టెలో తళ తళ మెరిసే గొలుసులు, రింగులు, దుద్దులు, గాజులూ అన్నీ సర్దుకుని బయలుదేరబోతుంటే సుశీల అతని దగ్గరకొచ్చి -

"నాకీ గొలుసు యిస్తారా ?" అంది.

"ఎందుకు ? కావాలంటే తీసుకో - నీకు ఏది కావాలంటే ఇవ్వలేదు నేను ?" అన్నాడు.

ఆమె తల దించుకుంది.

"ఇది ఇవ్వండి" అంది మెల్లిగా.

"నువ్వు మెడలో వేసుకుంటావా"

ఊహు, సుమ మెడలో వేస్తాను" అంది. ఆమె కంఠం దుఃఖంతో పూడుకుపోతోంది. అతని కనుబొమ్మలు ముడి వడ్డాయి. ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఊరుకున్నాడు ఆ గొలుసు ఆమె కిచ్చేసి ట్రంకు పెట్టెకి తాళంవేసి

"నే వచ్చేసరికి పొద్దుపోతుంది. నువ్వు అన్నం తినేసి పడుకో" అంటూ బయటకెళ్ళి పోయాడు.

దూరంగా ఆడుకుంటున్న సుమని పిల్చింది.

"వత్తున్నా" అంటూ పరుగెత్తుకొచ్చిన సుమని గుండెల కత్తుకుని గుండెల్లో కన్నీటిని కరగించుకుంది. సుమ బిక్క-ముఖం పెట్టి "ఎందుకు ఏడుస్తున్నావ్" అంది.

వెంటనే కళ్ళు తుడుచుకుని

"ఏం లేదు తల్లి, దా" అంటూ లోపలికి తీసుకెళ్ళి కాళ్ళుచేతులు కడిగి, ముఖం తుడిచి పౌడరు వేసింది.

"నాకేం బొట్టు చిన్నగా పెట్టవూ" అంది సుమ ముద్దుగా.

"ఎందుకూ" అంది.

"మా అమ్మ ఎప్పుడూ పెద్దబొట్టు పెడుతుంది. మా అమ్మ అస్సలు మంచిది కాదు" అంది.

"తప్పమ్మా. అలా అనకూడదు. మీ అమ్మ ఎంతో మంచిది" ఆ తర్వాత ఏమీ చెప్పలేకపోయింది.

సుమకి కాటుక పెట్టి, అందంగా బొట్టు పెట్టింది. జుట్టు దువ్వి రిబ్బను కట్టింది. మెడలో గొలుసు వేసింది అది తళతళ మెరుస్తోంది. సుమ కళ్ళు అంతకంటే మెరిశాయి.

"అమ్మ బాబోయ్ ఇది బంగారమా," అంది ఆరిందాలా, మెరిసే కళ్ళతో –

"కాదులే తల్లి! నువ్వే బంగారం" అంది సుశీల.

సుమ గాసు పాలలో బిస్కట్లు ముంచుకుని తింటూ ఏవో కబుర్లు ఆగకుండా చెప్తుంది.

ఇంటిలో సుమ కనిపించకపోతే పద్మ మామూలుగా విసుక్కుంటూ బయలుదేరింది.

“ఎందుకంత విసుగు ? వాళ్ళింటిలో వుంటుందిగా. పాపం, ఆమెకి పిల్లలంటే యిష్టం కాబోలు” అన్నాడామె భర్త.

ఏం అంత మోజు ? కొత్త కాపురమనుకుంటూ అప్పుడే తొందరెందుకో పిల్లలకోసం” అంటూ పైకి దోపిన చీర కుచ్చిళ్ళు కిందకి జార్చి ఎదురింటికి నడిచింది పద్మ.

కులాసాగా కబుర్లు చెప్తున్న సుమ తల్లిని చూసి ఠక్కున ఆగిపోయింది. సుమ ముస్తాబు చూసి పద్మ విస్తుపోయింది. ఏమిటీ అర్థం పర్థం లేని ఆప్యాయత అని విసుక్కుంది. మెడలో మెరిసే గొలుసు చూసి గతుక్కుమంది. అది గ్రహించిన సుశీల

“అది మామూలుదే. ఆయన గోల్డు కవరింగ్ వస్తువులు అమ్ముతారు. ఉత్తినే వేశాను” అంది సంజాయిషీగా.

పద్మ చటుక్కున ఆ గొలుసు తీసి యిచ్చేస్తూ “వాళ్ళ నాన్నగారికిలాంటివి యిష్టం వుండవు తీసేసుకోండి” అని యిచ్చేసి సుమ నెత్తుకుని....

"ఎన్నిసార్లు చెప్పాను ఎక్కడ పడితే అక్కడ పాలు తాగడం, అన్నం తినడం చెయ్యవద్దని" అంటూ వెళ్ళి పోయింది పద్మ.

సుశీల కుప్పకూలి పోయింది.

"వాళ్ళ నాన్నగారి కిష్టం వుండదు." అదే మాట పదే పదే చెవుల్లో మారుమ్రోగింది.

మొసళ్ళు నిద్రిస్తున్న సరస్సులాంటి ఆమె హృదయంలో అన్ని మొసళ్ళూ ఒకేసారి నిద్రలేచాయి. అది దుఃఖాశ్రు కాసారం.

అప్పుడే లోపలి కొచ్చిన అతన్ని ఆమె గమనించనే లేదు. అతను మాత్రం నెమ్మదిగా ఆమెని గుండెలకు హత్తుకుని.

"ఇంతగా బాధపడే దానివి నీ పిల్లని వదిలి నాతో వచ్చి వుండక పోవాల్సింది" అన్నాడు.

ఆమె కళ్లెత్తి అతన్ని చూసింది. తుఫానులో తడిసిన పక్షుల్లా అవి రెపరెపలాడాయి.

"నిజం మీ కళ్ళల్లో చిక్కుకుపోయిన నా గుండెను విడిపించుకోలేక వచ్చాను. అదే నాకు శాపం" అనుకుంది పైకి అనలేదు.

( ఆనందజ్యోతి వారపత్రిక నుండి )